హైదరాబాద్ వార్త



# సీజనల్ అలర్ట్..




◆విజృంభిస్తున్న మలేరియా, డెంగీ వ్యాధులు ◆ నెలరోజుల్లో 50కిపైగా కేసులు
◆బాధితుల్లో మురికివాడ ప్రజలే అధికం ◆అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ అధికారులు

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త;**
వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో బస్తీలు, మురికివాడ ప్రజలు విపరీతమైన దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన నెలరోజుల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కలిపి 50కిపైగా డెంగీ, మలేరియా కేసులు నమోదైనట్లు తెలుస్తుంది. అయితే నివారణకు ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చుపెట్టినా.. కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్ల దోమలను నశింపజేయడం సాధ్యం కావడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సిన సిబ్బంది కొన్ని ప్రాంతాల్లో చేస్తూ.. తూతూమంత్రంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అదీ అధికారులు, విఐపిలు ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తూ..బస్తీలలో కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో బస్తీలు, మురికివాడలకు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు దోమ కాటుకి గురై మలేరియా బారినపడుతున్నారు.

**మలేరియా..**
మలేరియా రెండు రకాలు ఉంటుంది. 1) మలేరియా ప్లాస్మోడియం వైవాక్స్(పీవీ), 2) ప్లాస్మోడియం పాల్సీ ఫారమ్(పీఎఫ్). వీటిలో ప్రమాదకరమైనది ప్లాస్మోడియం పాల్సీ ఫారమ్(పిఎఫ్). గతంలో ఇది ఎక్కడో ఆటవి ప్రాంతాల్లో కనిపించేది. కానీ ప్రస్తుతం నగరంలోనూ వ్యాపిస్తుడటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వాటి లక్షణాలు ఎలాంఉంటాయంటే...దోమ కుట్టిన 10-14 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. రోజు విడిచిరోజు జ్వరం వస్తుంది. తలనొప్పి ఒళ్లు నొప్పులు ఉంటాయి. చలి జ్వరం, చెమటలు పట్టడం, కొన్నిసార్లు వాంతులు అవుతాయి. ఇలాంటి లక్షణాలు ఉంటే ఎలాంటి మందులు తీసుకోకుండా రక్తపరీక్షలు చేసుకోవాలి. మలేరియా అని తేలితే ప్రత్యేక ఔషదాలు అందిస్తారు. పూర్తిగా తగ్గిపోతుంది.

**డెంగీ...**
నగరంపై డెంగీ వ్యాధి పంజా విసురుతుంది. ముసురుతున్న వాతావరణంతో పాటు వ్యాధులు ముదురుతున్నాయి. హఠత్తుగా తీవ్రజ్వరం, కాళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి. శరీరంపై దద్దుర్లు వస్తాయి. వాంతులు, వికారం, కొన్నిసార్లు రక్తంతో కూడిన మలవిసర్జన, రక్తంలో ప్లేట్‌లేట్స్ తగ్గుదల ఉంటుంది. లక్షణాలు బట్టి వెంటనే చికిత్స తీసుకోవాలి. పూర్తిగా నయం అవుతుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు తెస్తుంది.

**జాగ్రత్తలు...**
దోమలు వృద్ధి చెందకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. వీటి బారినపడకుండా చూసుకోవడం అన్నింటి కంటే చాలా కీలకం. బయటకు వేళ్లేటపుడు కాళ్లు, చేతులు కప్పి ఉంచేలా దుస్తులు వేసుకోవాలి. ఇంటి కీటికీలు, తలుపులకు దోమలు రాకుండా జాలీలను అమర్చుకోవాలి. చీకటి పడే సమయంలో కిటికీలు, తలుపులు తెరిచిఉండకుండా చూడాలి. ఇంట్లో ఉండే కూలర్లు, పూల కుండీల్లో తరచూ నీళ్ల మార్చాలి. వారానికి ఒక సారి పూర్తిగా ఎండిపోయే విధంగా చూడాలి. ఇంటి పరిసరప్రాంతాల్లో మురికిగుంటలు, కొబ్బరి చిప్పలు, తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు లేకుండా చూడాలి. ఇందులో నీరు నిల్వఉంటే డెంగీ దోమలు పెరగడానికి కారణమవుతాయి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత అన్నిటి కన్నా ముఖ్యం. బయట నుంచి ఇంట్లోకి వచ్చేటపుడు కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవడం మేలు. ప్రతి రోజూ వేడి ఆహారం తీసుకోవాలి. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. చిన్నపాటి జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలు ఏర్పడిన వెంటనే వైద్యుని తప్పనిసరిగా సంప్రదించాలి.

# పాతబస్తీలో అత్యంత భక్తిశ్రద్ధలతో 'బక్రీద్'



సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనలు అనంతరం బయటకు వస్తున్న ముస్లింలు

**చార్మినార్, జూన్ 29 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీలో ముస్లింలు బక్రీద్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బక్రీద్ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పాత నగరంలోని అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చారిత్రక మక్కా మసీదు, బహదూర్‌పుర శివారులో ఉన్న చారిత్రక మీరాలం ఈద్గా, మాదన్నపేట్ ఈద్గా, బోలక్‌పుర, ముషీరాబాద్, సంతోష్‌నగర్ ఈద్గాలు, కుడా స్టేడియంతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాలలో గురువారం ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు జరిపారు. మక్కా మసీదు, చారిత్రక మీరాలం ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాతబస్తీకి చెందిన వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు పెద్దఎత్తున గొర్రెలు, పొటేట్లను కొనుగోలు చేశారు. పాతబస్తీలోని ఏ ప్రాంతంలో చూసినా బక్రీద్ వాతావరణం కనిపించింది. ముస్లింలు ఒకరికి ఒకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చార్మినార్, మొగల్‌పుర, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, బార్కస్, సంతోష్ నగర్, రెయిన్‌బజార్, కామాటిపుర, కాలాఫత్తర్, హుస్సేనీఆలం, మీరాలంమండి, దారుషిఫా, ఎత్తెబార్‌చౌక్, శాలిబండ, జహానుమా, వట్టెపల్లి, కిషన్‌బాగ్, సులేమాన్‌నగర్, హాసన్‌నగర్, మొగల్ పుర, డబీర్‌పుర, కాజీపుర, ఫత్తెదర్వాజ, బిలాల్ నగర్, షంషేర్‌గంజ్ ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దక్షిణ మండలం డిసిపి సాయి ప్రసన్న ఆధ్వర్యంలో చార్మినార్ ఏసిసి రుద్ర భాస్కర్, చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కోటయ్యలు శాంతిభద్రతలను పర్యవేక్షించారు. బక్రీద్ ప్రార్థనలు సందర్భంగా పాతబస్తీలో ట్రాఫిక్‌ను వేరే ప్రాంతాలు మీదుగా మళ్లించారు. వక్ఫ్‌బోర్డు, జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ పాతబస్తీలో అన్ని ఏర్పాట్లు చేశారు.

# శివుడా.. చెట్టంత కొడుకును తెచ్చివ్వగలవా..!



**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త**
ఉవ్వెత్తున ఎగిసిపడిన ఉద్యమంలో రాతిబొమ్మలనుసైతం కదిలించిన ఆ గానం మూగబోయింది. స్వరాష్ట్రంకోసం జరిగిన సమయంలో పసి పిల్లాడి నుంచి పండు ముసలి వరకు జైకొట్టు తెలంగాణ అని నినదించేలా తట్టిలేపిన ఆ ఆట ఇక ఆగిపోయింది. గొంతెత్తి పాటల తూటాలు మోగించినా.. దిక్కులు పిక్కటిల్లేలా నినదించినా..గజ్జె కట్టి ధూం ధాం చేసినా..అది తెలంగాణ కోసమే అంటూ సమరోత్సాహాన్ని నింపిన సాయిచంద్.. ఇక ఆటాపాటలకు సెలవంటూ వెళ్లిపోవడం తీరని విషాదాన్ని మిగిల్చింది. తెలంగాణే శ్వాసగా.. నికార్సైన ఉద్యమకారుడిగా చివరి దాకా పోరు బాటలో పయనించిన సాయిచంద్ (39).ఆకస్మిక మరణం అందరినీ శోకసంద్రంలోకి నెట్టింది.
ప్రజాగాయకుడు సాయిచంద్ బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కారుకొండలో తన ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అయితే అర్థరాత్రి గుండెపోటు రావడంతో.. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమించడంతో గచ్చిబౌలిలోని కేర్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య రజని, ఒక కూతురు, కొడుకు ఉన్నారు. వనపర్తి జిల్లా అమరచింతలో 1984 సెప్టెంబరు 21న సాయిచంద్ జన్మించాడు. పేదకుటుంబంలో జన్మించినా ఎన్నోకష్టాలకోర్చి హైదరాబాద్‌లో పీజీ వరకు చదువుకున్నాడు. చిన్నతనం నుంచే ఆట పాటలతో ఉత్సాహంగా ఉండే సాయిచంద్ మంచి గాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు. హైదరాబాద్ చదువుకునే సమయంలోనే విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తూ..అనేక కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమంలోకి ప్రవేశించిన సాయిచంద్..ఆటాపాటలతో ఉర్రూతలూగించే వారు. ఉద్యమ సమయంలో అనేక సభల్లో పాల్గొన్న సాయిచంద్..తన కళా ప్రదర్శనలతో నాటి ఉద్యమనేతలను ఆకర్షించాడు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో తన పాటపాటలతో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం తెలంగాణ సాధించిన ప్రగతి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాటలతో చాటిచెప్పాడు. 2021 డిసెంబరులో సాయిచంద్‌ను సిఎం కెసిఆర్ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు.

# ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం



ఆహ్వాన ప్రతులను ఆవిష్కరిస్తున్న త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా విఎస్.జనార్ధన మూర్తి తదితరులు

చిక్కడపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:
విఖ్యాత సాహితీవేత్త, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ జన్మదినోత్సవాలను పురస్కరించుకుని త్యాగరాయ గానసభ నిర్వహణలో 'సాహితీ సప్తాహం' నిర్వహించబోతున్నట్లు గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్యక్రమానికి సంబందించిన ఆహ్వానపత్రులను ఆవిష్కరించారు. శుక్రవారం నుంచి జూలై 7వ తేదీ వరకు ఏడు రోజుల పాటు గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఈ సప్తాహం జరుగుతుందని, ఈ సభా ప్రాంగణంతో ఎంతో అనుబంధం ఉన్న ఇనాక్ వ్యక్తిత్వం, సాహితీ విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ఈ సప్తాహం ఉంటుందని, వివిధ ప్రక్రియల్లోని రచనలు రోజుకు ఒకటి ఆవిష్కరిస్తామని, వరుసగా వ్యాస పరిణామం(పరిశోధన), వలస (నవల), దిక్కులేనోడు (నాటిక) శూన్యం, విమర్శిని(విమర్శ), పోలి (కథానిక), ఏఎల్ఎంఎస్ ఆఫ్ పార్డన్(అనువాదం) గ్రంథాలను తెలంగాణ ప్రభుత్వసలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ సాహితీవేత్త నందినీ సిద్దా రెడ్డి, శాసనసభ తొలిసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్, తెలంగాణ సాహిత్య అకాడమిచైర్మన్ జూలూరి గౌరీశంకర్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరిస్తా రన్నారు. వివిధ రంగాల ప్రముఖులు, అతిథులుగా ప్రతిరోజు హాజరయ్యే కార్యక్రమాలకు తొలుత సాంస్కృతిక ప్రదర్శనలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యులు గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## అర గంట ఆలస్యంగా మెట్రో రైళ్లు

**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త :**
మెట్రో రైలు సర్వీసులు అరగంట ఆలస్యంగా నడవనున్నాయి. ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో మెట్రో కారిడార్ పై స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. దీని కారణంగా అరగంట ఆలస్య మవుతోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించిన విధంగా ఎల్అండ్‌టి సంస్థ జూబ్లీబస్‌స్టేషన్, మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ మధ్య కారిడార్-2లో మెట్రో రైలు సేవలను అందిస్తుంది. అయితే ఈ రూట్లో నడిచే మెట్రో రైళ్ల షెడ్యూల్‌లో మార్పులు చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30 నుండి జూలై 16 వరకు అరగంట ఆలస్యంగా నడుస్తాయని ఎల్అండ్‌టి ప్రతినిధులు తెలిపారు. కారిడార్2లో ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైలు సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ఈ సవరించిన షెడ్యూల్ సుమారు రెండు వారాల పాటు అమలులో ఉంటాయని పేర్కొంది. మెట్రో కార్యకలాపాలకు ఆటంకం లేకుండా నిర్మాణ కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలు కల్పించారు.

## టిపిసిసి అధికార ప్రతినిధిగా గౌరి సతీష్

**గన్‌ఫౌండ్రి, జూన్ 29ప్రభాతవార్త:**
టిపిసిసి అధికార ప్రతినిధిగా, విద్యావేత్త సీనియర్ కాంగ్రెస్ నాయకులు గౌరి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎ.రేవంత్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గౌరి సతీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజాస్వామ్య, సూత్రాలకు విరుద్ధంగా పాలన బిఆర్ఎస్ చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం దిశగా నిరంతర ప్రక్రియగా తన గళాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు సమర్థంగా వినిపించడమే తన ధ్యేయమన్నారు. పిసిసి అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం ప్రకారం పార్టీ విధానాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.



భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం

## దేవాలయాలకు తొలి ఏకాదశి వైభవ శోభ

### -కిటకిటలాడిన ఆలయాలు

**చిక్కడపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:**
తొలి ఏకాదశి సందర్భంగా గురువారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీయుకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు పర్యవేక్షణలో ఉత్సవం కన్నులపండువగా సాగింది. తెల్లవారుజామున నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనాది కార్యక్రమాలతో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ తీర్థప్రసాదాలను స్వీకరించారు.

**వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో....**
వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్దసంఖ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయం ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ సభ్యుడు డాక్టర్ టి.రామకృష్ణ, అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, ఎస్‌బివిఎస్.ఆచార్యులు, శివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

**లక్ష్మీగణపతి దేవాలయంలో..**
కాగా ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలను ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు డాక్టర్ ఎస్.వెంకటరమణ, ఆలయం ప్రధాన అర్చకులు కాశీనాథ్‌శర్మ, అర్చకులు జగన్మోహనాచార్యులు, రామాచార్యులు, బుచ్చమాచార్యులు, రాజన్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన బిసి కులాలను తిరిగి చేర్చాలి : ఆళ్ల రామకృష్ణ

**నాంపల్లి, జూన్ 29 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బిసి కులాల జాబితా నుండి తొలగించిన 26 కులాలను తిరిగి వెంటనే జాబితా చేర్చాలని తెలంగాణ బిసి కమిషన్ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు, కమిషన్ సభ్యులను కలిసి ఆయా బిసి సంఘాలు, ముఖ్యంగా శ్రీగౌరి సేవాసంఘం, హైదరాబాద్; తొలగించిన 26 కులాల పోరాట సమితి; రాష్ట్ర బిసి ఉద్యోగుల పెన్షనర్ సంక్షేమ సమితి, జాతీయ బిసి హక్కుల రక్షణ సమితి తరఫున పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ కోరుతూ గవర, శెట్టిబలిజ, తూర్పుకాపు, పొందర తదితర కులాలను బిసిలుగా తిరిగి బిసి కమిషన్ గుర్తించి తగు అనుకూల నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టుకు సమర్పించి వీరిని వెనుకబాటుతనం నుండి విముక్తిచేసి రక్షించాలని వినతిపత్రం సమర్పించినట్లు, బిసి కమిషన్ అనుకూలంగా స్పందిస్తుందన్న ఆశాభావాన్ని రామకృష్ణ వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పివివి.సత్యనారాయణ, కె.రాజశేఖర్, ఎం.సావిత్రి, ఎస్.వెంకటేశ్వరరావు, సూరి అప్పలరాజు, ఆళ్ల ఉపేంద్ర, మల్లాదిలక్ష్మి, వేణు, గవర జాతీయులు తదితరులు పాల్గొన్నారు.

## బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

**చిక్కడపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లిలోని షిరిడిసాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయం వ్యవస్థాపర వైస్‌చైర్మన్ పెదోళ్ళ గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజు గౌడ్ వివరించారు. జూలై 3న ఉదయం ఐదున్నర గంటలకు కాకడ హారతి కార్యక్రమంలో గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమవుతాయని, అనంతరం ఆరు గంటలకు చందనోత్సవం, అభిషేకం, తొమ్మిది గంటలకు సామూహిక సాయి వ్రతాలు, పన్నెండు గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని, రాత్రి పల్లకీసేవ, అనంతరం సాయి భజన ఉంటుందని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.



తలసానిని సన్మానిస్తున్న మహంకాళి దేవాలయ కమిటీ సభ్యులు

## బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**మెహిదీపట్నం, జూన్ 29, ప్రభాతవార్త :**
కార్వాన్ సబ్జిమండి నట్రాజ్‌నగర్‌లలోని నల్లపోచమ్మ-మహంకాళి దేవి అమ్మవార్ల 101 వార్షికోత్సవ బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ బోనాల ఉత్సవాలకు దేవాలయాల పరిసరప్రాంతాల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని కోరుతూ గురువారం ఆలయ కమిటీ అధ్యక్షులు ప్యాట నందకిషోర్ ఆధ్వర్యంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయాల అభివృద్ధి విషయాలతో పాటు బోనాల ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను చర్చించడం జరిగిందని అధ్యక్షులు ప్యాట నందకిషోర్ తెలిపారు. అనంతరం మంత్రికి శాలువాకప్పి ఘనంగా సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేష్, కోశాధికారి కట్ట శ్రీనివాస్, సలహాదారులు సేనాపతి చంద్రశేఖర్, కట్ట కుమారస్వామి, సభ్యులు పాల్గొన్నారు.





# నగరంలో భారీ వర్షం

**లోతట్టు ప్రాంతాలు జలమయం**

హైదరాబాదలో భారీ వర్షం పడింది. మోహదీపట్నం , అత్తాపూర్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, ఆరాంఘర్, రాజేంద్రనగర్ ఏరియాల్లో వర్షం దంచికొట్టింది. మెహదీపట్నం వైపువెళ్లే మార్గాలన్నీ జలమయమయ్యాయి. ఉప్పల్, నాగోల్ ,ఎల్బీనగర్, దిల్‌షుఖ్‌నగర్, మలక్‌పేట్ ,చార్మినార్ ప్రాంతాల్లో వర్షం భారీగా కురిసింది. నగర శివారుప్రాంతల్లోనూ సుమారు గంటపాటు దంచికొట్టింది. దీంతో పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధాన కూడళ్లలో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్లపై వరదనీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరదనీటిని తొలగించేందుకు జిహెచ్ఎంసి సిబ్బంది రంగంలోకి దిగారు. అత్యవసరమైతేనే తప్పనరగవాసులు బయటకు రావద్దని జిహెచ్ఎంసి సూచించింది.

### రోడ్ల పక్కన ఫ్రైడ్ రైస్, నూడుల్స్ తింటున్నారా..

# పంది కొవ్వు నూనె ఉండొచ్చు జాగ్రత్త



**పంది కొవ్వుతో వంట నూనె తయారిదారుడి అరెస్టు**

**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త**
ఫాస్ట్‌ఫుడ్..పేరు వినగానే నోట్లో నీరు ఊరాయి కదా..ఈ వార్త చూసిన తర్వాత కూడా మీరు అదే ఫీలింగ్‌లో ఉంటారా..పందికొవ్వుతో తయారు చేసిన నూనె కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఉపయోగిస్తున్నారండి. ఇదీ మన హైదరాబాద్‌లో.. కొంచం గుండె దిటవుగా చూసుకుని ఈ వార్త చదవండీ..
ఇటీవల నగరంలో కల్తీ అల్లంవెల్లుల్లీ పేస్ట్, ఐస్ క్రీమ్, సాస్, చాక్లెట్స్ బాగోతం బయటపడింది. అయితే, తాజాగా పంది కొవ్వుతో కల్తీ నూనెలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతోన్న కేటుగాడ్ని పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని అదుపులోకి తీసుకున్న తర్వాత సంచలన విషయాలు బయటకి వచ్చాయి.
నేరేడ్‌మెట్ పరిధిలోని ఆర్కేపురంలో రమేష్‌శివ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అయితే గుట్టు చప్పుడు కాకుండా రమేష్ ఇంట్లోనే గత కొన్నేళ్లుగా పండి కొవ్వుతో వంట నూనెలు తయారు చేస్తున్నాడు. తొలుత పంది మాంసం విక్రయించే వారి నుంచి కొవ్వు తెచ్చుకునేవాడు. ఆ తర్వాత దాన్ని వేడి చేసి పలు రకాల కెమెమికల్స్ కలిపితే అచ్చం వంట నూనెలాగా కనిపించే ఫుడ్ అయిల్స్‌ను తయారు చేశాడు. ఇలా తయారు చేసిన నూనెను రోడ్డు పక్కన ఉండే ఫ్రైడ్ రైస్ దుకాణాల నిర్వాహకులకు తక్కువ రేట్‌కు విక్రయించాడు అని పోలీసులు తెలిపారు.
దీంతో పక్కా సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రమేష్ ఇంటిపై ఆకస్మిక సోదాలు నిర్వహించారు. దీంతో గుట్టుగా పంది కొవ్వుతో నూనె తయారు చేస్తున్న నిందితుడి బండారం మొత్తం బట్టబయలైంది. పంది కొవ్వు నూనెను కొనుగోలు చేస్తున్న ఫాస్ట్ ఫుడ్ దుకాణదారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వార్నింగ్ ఇస్తున్నారు. నాణ్యతలేని ఫుడ్ తినడం వల్ల ఆరోగ్యానికి ప్రమాదమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిందితుడి చుట్టు పక్కల ప్రాంతాల వాళ్లు ఇన్నాళ్లు తాము పంది కొవ్వుతో చేసిన ఫుడ్ తిన్నామా అని ఆందోళన చెందుతున్నారు.


ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న దేవర వంశీ

## ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు: దేవర వంశీ

**మెహిదీపట్నం, జూన్ 29, ప్రభాతవార్త :** ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతుండడంతోనే రోజు రోజుకు ప్రధాని నరేంద్ర మోదీపై ప్రజలలో ఆదరణ పెరుగుతుందని బిజెపి గుడిమల్కాపూర్ డివిజన్ నాయకులు దేవర వంశీ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 9 సంవత్సరాల పరిపాలనలో భాగంగా గురువారం గుడిమల్కాపూర్ డివిజన్ జాఫర్ గూడ, కుమ్రాజీగూడలో ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు ప్రతి ఇంటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం దేవర వంశీ మాట్లాడుతూ.. నేడు దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందంటే ప్రధాన మోదీ చేపడుతున్న కార్యక్రమాలే కారణమన్నారు. దేశ ప్రజలే కాకుండా ప్రపంచ దేశాలు సైతం మోదీని మెచ్చుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాధాకృష్ణ, ముఖేష్‌సాగర్, శ్రీకాంత్‌సాగర్, లక్ష్మికాంత్ యాదవ్, గిరిధర్, సందేశ్‌యాదవ్, సుధాకర్‌యాదవ్, పురుషోత్తం, దేవి శంకర్, శ్రీనివాస్, నవీన్, వెంకటేష్, అశ్విన్ మోదీ, ప్రభుపూజారి, దేవయాదవ్, త్రిలోక్, ప్రణయ్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామ క్రిష్ణ, నివేదిత

**కంటోన్మెంట్, జూన్ 29 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న నిధుల ద్వారా కంటోన్మెంట్ 6వ వార్డు భారతీ అవెన్యూ కాలనీలో రూ.11 లక్షల వ్యయంతో మంచినీటి పైప్‌లైన్ పనులను కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదిత, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : నివేదిత

**కంటోన్మెంట్, జూన్ 29 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్యనందిత, నివేదిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహముదిరాజ్ తెలిపారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని రెజిమెంటల్ బజార్‌లోని శ్రీపాండురంగ విఠలేశ్వర వెంకటాద్రి స్వామి వారి ఆలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవ వేడుకలకు వారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వీరిని ఈఓ జి.సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ దాసరి కర్ణకుమార్(చిన్నా), శాలువకప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పనస సంతోష్, గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నంది కంటి రవి తదితరులు పాల్గొన్నారు.

### పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

**అడ్డగుట్ట, జూన్ 29 ప్రభాతవార్త:** తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలోఉన్న శ్రీపాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్య నారాయణ, మాజీ చైర్మన్ దాసరి కర్ణకుమార్, బిఆర్ఎస్ నాయకులు రావుల సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నేత నందికంటి రవి . .

తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన బ్రహ్మోత్సవ వేడుకల్లో గ్రేటర్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి నంది కంటి రవి పాల్గొని పూజలు నిర్వహించారు.

## ప్రజలకు తొలి ఏకాదశి, బక్రీద్ శుభాకాంక్షలు


విఠలేశ్వర ఆలయంలో పూజలుచేసిన భజరంగ్ సేనా అధ్యక్షుడు

**నిజాంపేట్, జూన్ 29 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలందరికీ తొలి ఏకాదశి, బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి. గురువారం తొలి ఏకాదశి పండుగ సందర్భంగా నిజాంపేటలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులతో కలిసి జరుపుకున్నారు.

## వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

**అఫ్జల్‌గంజ్, జూన్ 29 ప్రభాతవార్త:** తొలి ఏకాదశి పూజలను ఉస్మాన్ షాహిలోని విఠలేశ్వర ఆలయంలో గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావు గుప్త, గోల్కొండ బిజెపి జిల్లా అధ్యక్షులు వి.పాండుయాదవ్, బిజెపి నాయకులు బోయిని వెంకటేష్‌యాదవ్, రఘునందన్‌యాదవ్ విఠలేశ్వర స్వామి, రుక్మిణబాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

**గోషామహల్, జూన్ 29ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు మాజీ కార్పొరేటర్ పి.మమతసంతోష్‌గుప్త తెలిపారు. ఈ మేరకు గురువారం గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని హన్‌మాన్ టేకిడిలో బిఆర్ఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నేత, బిఆర్ఎస్ నాయకులు ఆర్వీ మహేందర్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్, బిఆర్ఎస్ నాయకులు దిలిప్‌ఘనాతే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.సంతోష్‌గుప్త మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.కలిసి కట్టుగా నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ముందుకు వెళ్తామన్నారు.నియోజకవర్గంలో బిజెపిని ఓడించడమే బిఆర్ఎస్ లక్ష్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు.


హన్‌మాన్‌టేకిడిలో బిఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీకార్పొరేటర్ మమతసంతోష్‌గుప్త, ఉద్యమనేత ఆర్వీ మహేందర్

# పేదలకు విద్య, వైద్యం, ఆర్థికాభివృద్ధే లక్ష్యం

### మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, అగ్రకుల పేదలకు విద్య, వైద్యం,ఆర్థికంగ అభివృద్ధి చేయడం కోసమే మాదిగ దండోరా పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దోమల మల్లేష్‌మాదిగ అన్నారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ దండోరా ఆవిర్భావసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వామ పక్ష విద్యార్థి నాయకులు, కులసంఘాల్లో పనిచేసిన వారితో కలిసి మాదిగ దండోరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలో సంపద సృష్టికి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల శ్రమతోనే ఏర్పడిందని కానీ పాలకులు అవలంబిస్తున్న విధానాల వల్ల సంపద కొంత మంది చేతుల్లోకి పోయిందన్నారు. దేశంలోని పేదలకు సంక్షేమ పథకాలపేరుతో ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తున్నారని కానీ ఆ పథకాలు ఏవీ పేదరికాన్ని నిర్మూలించవన్నారు.దళిత, బహుజనులకు జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని అలాగే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాలయాల్లో అడ్డగోలు ఫీజులను అరికట్టాలన్నారు. ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ కొరకు మార్గదర్శకాలు ఏర్పాటు చేసి ఫీజుల దోపిడీలను నియంత్రించాలన్నారు. ఒక వేళ ప్రభుత్వం స్పందించపోతే మాదిగ దండోరా నాయకత్వంలో గ్రామ,మండల జిల్లాస్థాయిల్లో విద్యార్థులు, తల్లిదండ్రులను సమీకరించి ఫీజుఎంత చెల్లించాలనే దానిపై కమిటీలు వేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోర్డినేటర్లు బొజ్జ శ్రీధర్ మాదిగ, ఈదుల పరుషురాం మాదిగ, అరుణాచలం శివకుమార్, బోయ ప్రవీణ్‌మాదిగ, పోతురాజు కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మాదిగ దండోర పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లేష్‌మాదిగ, బొజ్జ శ్రీధర్‌మాదిగ, పరుశురామ్‌మాదిగ తదితరులు


మాట్లాడుతున్న భూపతి ముదిరాజ్

## కౌశిక్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

### అఖిలభారత కోలి సమాజ్-తెలంగాణ ముదిరాజ్ మహాసభ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** ముదిరాజ్ కులానికి చెందిన పాత్రికేయుడిని కొట్టి, తిట్టి అవమానపరిచిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలిన అఖిలభారత కోలీ సమాజ్ -తెలంగాణ ముదిరాజ్ మహాసభ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలభారత కోలి సమాజ్ ఉపాధ్యక్షుడు రోటం భూపతి ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ స్టేట్ ప్రెసిడెంట్ చొప్పరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌పై కొన్ని శక్తులు ఆయన్ను రాజకీయంగా మానసికంగా ఇబ్బందిపెడుతున్నారన్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ముదిరాజ్‌లు పార్టీలకు, సంఘాలకు అతీతంగా ముందుకు వచ్చి నిరసన తెలపడం శుభపరిణామం అన్నారు. అదే ఐక్యతతో సబ్బండ వర్గాలను కలుపుకుని రాజ్యాధికారం దిశగా పయనించాలని ,ఒకప్పుడు బిసికులాల్లో ఐక్యంగా ఉండి పోరాటం చేసిన యోధుల స్ఫూర్తి పొంది ముందు సాగాలన్నారు. అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ జాతికి అన్ని విధాలుగా నష్టం జరిగిందని దేశవ్యాప్తంగా ఒకే రిజర్వేషన్, ఒకటే కులంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కె. హనుమంతరావు, గరిగంటి రమేష్, పులిజగన్, అశోక్, నారాయణ, సతీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్‌నగర్ డివిజన్‌లో తాగునీటి సమస్య తీర్చాలి


వాటర్‌వర్క్స్ ఎండికి వినతి పత్రాన్ని అందజేస్తున్న మహాలక్ష్మీ రామన్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్ డివిజన్‌లోని ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ వాటర్ వర్క్స్ అధికారి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వాటర్ వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆమె కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీరామన్‌గౌడ్ మాట్లాడుతూ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలలో ప్రజలు మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, మరి కొన్ని చోట్ల నీటి ప్రషర్ చాలా తక్కువగా వస్తున్నదని విచారం వ్యక్తం చేశారు. బస్తీలలో కొత్త, కొత్త మంచినీటి పైప్‌లైన్‌లు వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె కోరారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి

### మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి

**ధర్నాచౌక్, జూన్ 29, ప్రభాతవార్త:** క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ముషీరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఇండోరన స్టేడియంలో ఆర్ఓ వాటర్ సిస్టంను నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నాయిని నరసింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు తమ వంతు సహకారం అందించేందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం నాయిని నరసింహారెడ్డి జయంతిని పురస్కరించుకుని వివిధ రకాల క్రీడల పోటీలను నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడాకారుల కోసం వాటర్ ఆర్ఓ సిస్టంను ఏర్పాటుచేసినందుకు స్థానిక క్రీడాకారులు శ్రీనివాసరెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు భిక్షపతియాదవ్, నేత శ్రీనివాస్, బుజ్జి వెంకటేశ్వరరావు, రేషం మల్లేష్, లక్ష్మణ్‌గౌడ్, సిరిగిరి శ్యాం, బాల్‌రాజ్‌గౌడ్, కార్తీక్‌యాదవ్, సాయి, కృష్ణ, రవియాదవ్, సదా, అజ్జు, సాయి యాదవ్, దీపు పాల్గొన్నారు.


ఆర్ ఓ వాటర్ సిస్టంను ప్రారంభిస్తున్న వి.శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న గౌతంరావు

## బిజెపి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి అత్యధిక మెజారిటితో ఘన విజయం సాధించాలని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతంరావు కార్యకర్తలకు సూచించారు. గురువారం బిజెపి నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబర్‌పేట అసెంబ్లీ విస్తారకల సమాశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కంచుకోట అందుకే ప్రతి ఒక్క కార్యకర్త బిజెపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన మార్గదర్శనం చేశారు. నియోజవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ శ్యామ్ రాజ్, కార్పొరేటర్ అమృత, వనం రమేష్, సూర్యప్రకాష్‌సింగ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి పండుగ వేడుకలు


శ్రీవారి దేవాలయానికి తరలివస్తున్న భక్తులు

**సైఫాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** తొలి ఏకాదశి పండువను పురస్కరించుకుని బషీర్‌బాగ్, సైఫాబాద్, లిబర్టీ, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాలలోని దేవాలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి, ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు దేవాలయాల్లో స్వాములకు ఘనంగా పూజలు నిర్వహించారు. ముఖ్యంగా లిబర్టీ వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంకు భక్తులకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి భక్తులు పూజలు నిర్వహించారు. గోవింద నామాలతో దేవాలయం మారుమ్రోగింది. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.

## భక్తిశ్రద్ధలతో గోల్కొండ జగదాంభిక అమ్మవారికి పూజ

**మెహిదీపట్నం, జూన్ 29, ప్రభాతవార్త :** ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు గోల్కొండలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచే కాకుండ నగరం నలుమూల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా గురువారం గోల్కొండ శ్రీ జగదాంభిక అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడవ పూజను నిర్వహించి బోనం సమర్పించారు. ప్రత్యేక పూజల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆరెల్ల జగదీష్ యాదవ్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బాబా భక్తురాలు లక్ష్మీబాయి షిండే 9 నాణాలకు పూజలు


పూజలు నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** నల్లకుంటలోని శివం రోడ్డులోని పుట్టపర్తి సాయిబాబాచే ప్రారంభించిన శివం ఆలయంలో గురువారం సాయినాథుని భక్తురాలు లక్ష్మీబబాయి షిండే అందించిన 9 నాణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు బృందం లక్ష్మీబాయి షిండే మునిమనువడు అరుణ్ గైక్వాడ్ షిండేకు భక్తులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం శివం ఆలయంలోకివెళ్లి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఆ నాణాలను ఏర్పాటు చేశారు. అనంతరం భజనలు, గీతాలను ఆలపించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై 9 నాణాలకు పూజలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ హెచ్‌జె.దొర, శేషసాయి ట్రస్ట్ కార్యదర్శి రాజేందర్, సాయిబాబా, ఎంఎల్ఎన్.స్వామి, కె.లక్ష్మీనరసింహా తదితరులు పాల్గొన్నారు.

# పద్మవిభూషణ్ మంగళంపల్లి బాలమురళీకృష్ణకు సంగీత నివాళి

**నాంపల్లి, జూన్ 29 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత కళాకారుడు పద్మవిభూషణ్ డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ 93వ జయంతి వేడుకలను నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో రాగవర్ధని కల్చరల్ సొసైటీ, హోప్ అడ్వర్టైజింగ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఘనంగా నిర్వహించి సంగీత నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి డా. బాలమురళీకృష్ణ ప్రియశిష్యుడు డి.వి.మోహన్‌కృష్ణ, శిష్యబృందం జ్యోతిప్రకాసనం చేసి గురువు బాలమురళీకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి డా. బాలమురళీకృష్ణ రచించిన గణపతి ప్రార్థనతో సంగీత కచ్చేరిని ప్రారంభించారు. అనంతరం మోహనకృష్ణ, తన శిష్యబృందం పి.ఎస్.కె.రమాకాంత్ గాత్రం, ఇషిత, మయుఖ్ గాత్ర యుగళంతో మంగళంపల్లి బాలమురళీకృష్ణ రచనలు వీనులవిందుగా గానంచేసి ఆహుతులను తన్మయుల్ని చేశారు. ఈ సందర్భంగా సభాకార్యక్రమం మోహనకృష్ణ రచించిన గురువందనతో ప్రారంభం కాగా సాయిచరణ్ భాస్కరుని హరిణి ఇవటూరి సమర్పించారు.ముఖ్యఅతిథులుగా పాల్గొన్న హైదరాబాద్ సోదరులు డి.శేషాచారి, డి.రాఘవాచారి, ఆత్మీయ అతిథి నేమాని సోమయాజులు పాల్గొని బాలమురళీకృష్ణను స్మరించుకొన్నారు. సభానంతరం ప్రఖ్యాత నేపథ్యగాయని మాళవిక బాలమురళీకృష్ణ రచనలతో గాత్రకచేరి సమర్పించగా ప్రధానాంశంగా డి.వి.మోహన్‌కృష్ణ గురువు మంగళంపల్లి రచనలతో గాత్రకచ్చేరి కావించారు. వి.ఎస్.పి.గాయత్రి శివాని వయోలిన్, పి.జయ భాస్కర్ మృదంగం, సోమయాజులు ఘట్టంలతో అద్భుత వాద్యసహకారం అందించగా సాయివైష్ణవి గాత్రసహకారాన్ని అందించి సంగీత కచ్చేరీ మరింత రక్తికట్టించి విచ్చేసిన అశేష ప్రేక్షకులను సంగీతలోకంలో విహరింపజేసి, డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ జయంతి సందర్భంగా ఘనంగా సంగీత నివాళులర్పించారు.



సంగీత కచ్చేరీలో ఒక దృశ్యం


ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న జంపన ప్రతాప్

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. తొలి ఏకాదశి, బక్రీద్ పర్వదినాలను పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లిలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో జంపన ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు,ప్రార్థనలు జరిపి అటు హిందువులకు, ఇటు ముస్లిం మైనార్టీలకు శుభాకాంక్షలు తెలిపారు.

## బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే.


బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

**నిజాంపేట్, జూన్ 29 ప్రభాతవార్త:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సాయినగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఫ్లాట్స్ వద్ద ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బక్రీద్ పండుగ ప్రార్థనల్లో గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరు త్యాగం, ప్రేమ, విశ్వాసం, భక్తిని అవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఖాన్, నబీషర్ఫి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఈద్‌ముబారక్ తెలిపిన టిఎన్‌జివో నేతలు


ముజీబ్‌హుస్సేన్‌కు ఈద్ ముబారక్ తెలుపుతున్న టిఎన్‌జిఓ నేతలు

**అఫ్జల్‌గంజ్, జూన్ 29 ప్రభాతవార్త:** బక్రీద్‌ను పురస్కరించుకుని టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ జిల్లా ప్రతినిధులు విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, కె.శ్రీనివాస్‌లు కలిసి బోకె అందచేసి శాలువ కప్పి సన్మానించారు. బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే


ముస్లిం పెద్దలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** బక్రీద్ పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గరువారం ఎంసిహెచ్ గ్రౌండ్‌లో ముస్లింలతో కలిసి ప్రత్యేకంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్ కుమార్‌గౌడ్, ముస్లిం పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనతోనే వికలాంగుల సమస్యలు పరిష్కారం



హెలెన్ కెల్లర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:** హెలెన్ కెల్లర్ అంధులకు, బధిరులకు, మూగవారికి వారధిగా ఉంటూ వికలాంగుల ఉద్యమాల సారథిగా ప్రపంచస్థాయిలో పేరును సంపాదించిన గొప్ప మహిళ హెలెన్ కెల్లర్ అని డెలవప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కోకన్వీనర్ (అడ్మిన్) వి.భారతి, కోకన్వీనర్ కె.వెంకటేశ్ గౌడ్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో డెలవప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్ ఆధ్వర్యంలో బధిరుల,అంధుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 143వ జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపన ద్వారానే వికలాంగుల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా వారి ఉజ్వల భవిష్యత్తు కోసం విశేషంగా కృషి చేశారన్నారు. పట్టుదలతో సాధించలేనిది ఏదీ లేదని విశ్వసించిన హెలెన్ కెల్లర్ తన జీవితం ద్వారా నిరూపించి ప్రపంచ పౌరులందరికీ ఆదర్శప్రాయులుగా నిలిచారన్నారు. ఒక వికలాంగుల కష్టసుఖాలపైనే కాకుండా మహిళా హక్కుల కోసం పుస్తకాలను రచించారని, స్వయంగా ఉద్యమాలను కూడా నడిపారన్నారు. ?19వ శతాబ్దంలో అత్యంత శకివంతురాలిగా గొప్పను పేరును సంపాదించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్డీ ప్రతినిధులు కిషోర్, ఎస్ఎ.వుద్దీన్ నవాజ్ ఖాన్, ఆంజనేయులు, సత్యనారాయణ, మున్నీసా బేగం, సునీత, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతకు ప్రతీక బక్రీద్ : డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

**తార్నాక, జూన్ 29 ప్రభాతవార్త:** విశ్వాసం, కరుణ, ఐక్యతకు ప్రతీక బక్రీద్ పండుగ అని నగర డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్ రెడ్డి పేర్కొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లో ఉన్న మైనార్టీ నేతలు, ప్రజలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాజా పాష, యాకూబ్ షరీఫ్, అలి,ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


ముస్లింలకు బక్రిద్ శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

# బిఆర్ఎస్‌ను వీడి... కాంగ్రెస్‌లో చేరుతున్నా : కొత్త మనోహర్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీలో చేరిక విషయాన్ని ప్రకటిస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ మలిదశ ఉద్యమకారులను అణచివేయడం.. వారికి ఏమాత్రం ప్రాధాన్యత లేకపోవడం.. కనీసం గౌరవం కూడా ఇవ్వకపోవడంపై విసిగిన తాను బిఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ మాజీ ఇంఛార్జి, 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమైన ఆయన టిపిసిసిఅధ్యక్షుడు రేవంత్‌రెడ్డిఆధ్వర్యంలో ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసివచ్చి గురువారం మంద మల్లమ్మ చౌరస్తా సమీపంలోని సాయి రాంనగర్‌లో ఉన్న తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన తన వర్గీయులు, అనుచరులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో బిఆర్ఎస్‌నుండి ఎమ్మెల్యేగా పోటీచేసిన తాను ఎవ్వరూ ఊహించని రీతిలో 43వేలపై చిలుకు ఓట్లు సాధించి ఓటమి పాలైనా పార్టీని బలోపేతం చేశామని తెలిపారు. అయితే మహేశ్వరంనియోజకవర్గంలో ఉద్యమకారులకు, మొదటి నుండి పార్టీలో ఉంటున్న వారికి ప్రాధాన్యత అసలు లేదనీ కనీసం తనకు, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి సైతం మహేశ్వరం నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వకుండా అగౌరవపరుస్తున్నారని తెలిపారు. ఆమన్‌గల్‌లో ఉన్న తన స్వంత భూమి నుండి ఉచితంగా పేదలకు పట్టాలు ఇస్తుంటే రిజి స్ట్రేషన్లు జరగకుండా అడ్డుకుంటూ ఇబ్బంది చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ధరణి వల్ల ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయనీ దీని వల్ల మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న తన స్వంత భూమి విషయంలో కూడా ఇబ్బందులు కలుగుతునా న్నయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కబ్జాదారులకు, అవినీతిపరులకు మాత్రమే ప్రాధాన్యత ఉన్నదని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్‌లో ఇమడలేని పరిస్థితి ఉందనీ ఈ నేపథ్యంలో పార్టీని వీడుతున్నట్లు ఆయన ప్రకటించారు. జూలై 2న ఖమ్మంలో రాహుల్‌గాంధీ హాజరయ్యే భారీ బహిరంగ సభలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డితో సహా నియోజకవర్గం నుండి సుమారు 5 వేల మందితో తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మనోహర్ రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నాయకులు గుల్ల సంతోష్‌కుమార్, వేద భవానీ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 3న గురుపౌర్ణమి మహోత్సవం

**ఎల్.బి.నగర్, జూన్ 29 ప్రభాతవార్త :** జూలై 3వ తేదీన గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్మిస్తున్నట్లు చైతన్యపురి డివిజన్ శ్రీవెంకట సాయినగర్ శ్రీసాయి సన్నిధి చైర్మన్ ఎన్.శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. గురుపౌర్ణమి మహోత్సవానికి శ్రీసాయిబాబా సమస్త షిరిడి ముఖ్య పూజారి కెటి.ధర్మాధికారి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా కాకడ హారతి, అభిషేకము, శ్రీసాయి సత్య వ్రతము, ధూపహారతి, శేజ్‌హారతి తదితర ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యేభక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తామని, సాయంత్రం 7 గంటలకు బాబా రథోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అష్టలక్ష్మి దేవాలయంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా లక్ష తులసి అర్చన



అష్టలక్ష్మి ఆలయంలో తులసి అర్చన చేస్తున్న పురోహితుడు

**ఎల్.బి.నగర్, జూన్ 29 ప్రభాతవార్త :** అష్టలక్ష్మి దేవాలయంలో లక్ష తులసి అర్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆర్.కె.పురం డివిజన్ వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా దేవాలయంలో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. శ్రీమన్నారాయణుడిని దర్శించుకునేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

## త్వరలో పార్కు అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూన్ 29 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్‌కెడినగర్ పార్కు అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని కోరడం జరిగింది. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ వెంటనే పార్కు స్థలాన్ని సందర్శించి వీలైనంత త్వరగా పార్కు అభివృద్ధి ప్రారంభిస్తానని కాలనీవాసులకు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి చేనేత మోర్చా కన్వీనర్ రఘురాం నేత, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కృష్ణారావు, శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రావు, రమేష్‌బాబు, పవన్ పాల్గొన్నారు.

## ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను వాడుకోవాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



పబ్లిక్ టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జూన్ 29 ప్రభాతవార్త :** ప్రజలు ఆత్మగౌరవంగా భావించి బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకుండా పబ్లిక్ టాయిలెట్లను వాడుకోవాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మూసారాంబాగ్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను ఆమె ప్రారంభించి మాట్లాడుతూ జిహెచ్ఎంసి, వాల్మీకి సమాజ్ వారి అనుసంధానంతో పబ్లిక్ టాయిలెట్లను నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సమాజ్ సభ్యులు రాజేష్, ధర్మేంద్ర, పరుశురాం, సంతోష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిచంద్ అంతిమ యాత్రలో పాల్గొన్న నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** హఠాన్మరణం చెందిన తెలంగాణ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అంతిమ యాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపి మల్లు రవి, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు యాత్రలో పాల్గొని సాయిచంద్‌కు నివాళులర్పించారు. అదే విధంగా రాష్ట్ర బిఎస్‌పి అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్‌లతో పాటు పలువురు అంత్యక్రియలకు హాజరై సాయిచంద్‌కు నివాళులర్పించారు.

## మదర్ డెయిరీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తా : మంత్రి జగదీశ్‌రెడ్డి



నూతన బ్రాండ్ పాల ప్యాకెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి, చైర్మన్, పాలకవర్గం

**హయత్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** నార్ముల్ మదర్‌డెయిరీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లవేలలా అందిస్తానని తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయంలో 3కోట్ల రూపాయలతో నూతనంగా ఏర్పాటుచేసిన బాయిలర్, కోల్డ్‌స్టోరేజీ, పాలస్టోరేజీ ట్యాంకు, విస్తరించిన కర్డ్‌ప్లాంటు, విజయ నల్లగొండ-రంగారెడ్డి నూతన బ్రాండ్ పాలప్యాకెట్‌ను ఆయన సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తోందన్నారు. ఈక్రమంలో రైతులకు సబ్సిడీపై గేదెలను అందించడంతో పాటు యూనియన్‌కు పోసే పాలపై 4 రూపాయల సబ్సిడీని అందిస్తోందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పాలను సరఫరా చేయడం ద్వారా సంస్థ వారి నమ్మకాన్ని పెంచుకోవాలని సూచించారు. పాలతోపాటు ఉప ఉత్పత్తులైన పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, ఫ్లేవర్డ్ మిల్క్, స్వీట్స్ వంటి వాటి మార్కెటింగ్‌ను పెంచుకుని సంస్థను ఆర్థికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలని ఆయన పాలకవర్గానికి సూచించారు. సంస్థ మనగడలో ఉద్యోగుల పాత్ర కీలకమని, నిబద్దతతో పనిచేసి సంస్థ ఎదుగుదలకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.కృష్ణ, పాలకవర్గ సభ్యులు అరుకాల గాల్‌రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, చింతలపురి వెంకట్రామిరెడ్డి, కార్నటి జయశ్రీ, చల్లా సురేందర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, కోట్ల జలెందర్‌రెడ్డి, కందాల అలివేలు, గూడురు శ్రీధర్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## దళితులపై దాడులు చేస్తే సహించం: బేర

**సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** దళితులపై దాడులు చేస్తే సహించేది లేదని దళిత ఐక్య వేదిక నాయకుడు బేర బాలకిషన్ స్పష్టం చేశారు. ఇటీవల అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్ప వద్ద జరిగిన ఘటనలో గాయపడ్డ మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ నాయకుడు ముత్యాల కృష్ణ సోదరుడు ముత్యాల నర్సింహను గురువారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కార్యక్రమం సందర్భంగా నర్సింహపై దాడి చేశారనీ దీనిని ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి నాయకులు బేషరుతుగా క్షమాపణ చెప్పకుంటే దళిత సంఘాలతో ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామిడి రాంరెడ్డి, ముత్యాల కృష్ణ, పుట్టగళ్ల సంతోష్, కర్రె సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెలగూడ శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు

**సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ఇఓ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్, చింతపట్ల జ్ఞానేశ్వరచారి, స్థానిక కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డిలతో పాటు పలువురు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

## ఇంజాపూర్ గ్రామంలో బక్రీద్ పండుగ వేడుకలు



ముస్లీం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ధనరాజ్‌గౌడ్ తదితరులు

**తుర్కయంజాల్, జూన్ 29 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటి పరిధిలోని ఇంజాపూర్ గ్రామంలో బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఈద్గా దగ్గర ముస్లిం సోదరులకు ప్రార్థనల అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్, మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్‌పాషా, ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా వారు మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా సోదరభావంతో కలిసికట్టుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యాసీన్, ఇల్యాస్,మజీద్, మస్జీద్ కమిటీ అధ్యక్షులు రహీమ్, మజర్, ఐజాస్, ఉస్మాన్, బురహన్, రషీద్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న కందికంటి శ్రీధర్‌గౌడ్ తదితరులు
(ప్రభాతవార్త, సైదాబాద్)

## అన్ని వర్గాల సంక్షేమంకోసం ప్రభుత్వం కృషి : హోంమంత్రి మహమూద్ అలీ



హోంమంత్రి, ఆజం అలీలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**మలక్‌పేట, జూన్ 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని అజంపురలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూమేష్, డైరెక్టర్లు బట్కిరి విద్యానంద్, నాయకులు సునిత్ తదితరులు హోంమంత్రి, మలక్‌పేట నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీలను ఘనంగా సన్మానించి పండుగ శుబాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందన్నారు. ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అదే విధంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తీగల అజిత్‌రెడ్డి, చల్లూరి రఘునందన్‌రెడ్డి, గౌర శశిధర్ తదితరులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల మద్దతుతో మహేశ్వరంపై కాషాయ జెండా ఎగురవేస్తా: అందెల



గడప గడపకు బిజెపిలో అందెలను ఆశీర్వదిస్తున్న మహిళ

**సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** ప్రజల మద్దతుతో మహేశ్వరం నియోజక వర్గంలో కాసాయ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ స్పష్టం చేశారు. మహాజన సంపర్క్ అభియాన్-గడప గడపకు బిజెపి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ శేషాద్రినగర్, సౌభాగ్యనగర్, నవారి యాదిరెడ్డి కాలనీ, వినాయక హిల్స్ తదితర కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరిట అల్మాస్‌గూడలో కబ్జాలు, అవినీతి జరుగుతున్నదని ఆరోపించారు. చెరువుల సుందరీకరణ పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దోచుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారనీ వారి మద్దతుతో పార్టీ జెండాను ఎగురవేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, జెనిగె పద్మా అయిలయ్య యాదవ్, తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల సునీతశ్రీకాంత్‌గౌడ్, రామోజీఅమితశ్రీశైలంచారి, గూడెపు ఇంద్రసేన, దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, నడికుడ యాదగిరి, గుర్రం మల్లారెడ్డి, జక్కిడి జంగారెడ్డి,మద్ది రాజశేఖర్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, మమతాఆనంద్, నీలా రవినాయక్, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తర్రె మల్లేష్ యాదవ్, పెత్తుల్ల పుల్లారెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేద వధువుకు ఉప్పల ఫౌండేషన్ చేయూత : చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త




పేద వధువు కుటుంబానికి కానుకలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జూన్ 29 ప్రభాతవార్త :** పేదింటి వధువుకు ఉప్పల ఫౌండేషన్ చేయూతను అందించింది. ఉప్పలఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదింటి అమ్మాయి వివాహానికి అవసరమైన వస్తువులను అందజేశారు.కర్ణాటక గుల్బర్గాకి చెందిన మల్లేశ్‌పద్మల కూతురు భవాని వివాహంకోసం నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ కార్యాలయంలో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త గురువారం వారి కుటుంబ సభ్యులకు పుస్తెమెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కూతురు కుటుంబ సభ్యులు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువతకు క్రీడలు ఎంతో ముఖ్యం : కార్పొరేటర్ పన్నాల



క్రికెట్ ఆడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి

**నాచారం, జూన్ 29 ప్రభాతవార్త:** విద్యార్థులు, యువతకు క్రీడలు ఎంతో ముఖ్యమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్నపూర్ణ కాలనీలో 18 స్పోర్ట్స్ ఎరీన క్రికెట్ అకాడమీ, బాక్స్ క్రికెట్ క్రీడల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథుగా హాజరై ప్రారంభించారు. జిహెచ్ఎంసీ క్రీడలకు ఎంతో ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఈ సందర్భంగా 18స్పోర్ట్స్ ఏరినలో క్రికెట్ కోచింగ్, బాక్స్‌క్రికెట్ ను ఆడుకునేందుకు యువతకు అందుబాటులోకి తెచ్చినందుకు నిర్వాహకులను కార్పొరేటర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు యూసిన్, హరీష్, కార్తిక్, స్థానిక నాయకులు పైళ్ల ప్రవీణ్, దయాకర్ రెడ్డి, గణేష్, కటర్ల శేఖర్, బానుచంద్రా రెడ్డి, మెండ రఘు తధితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారిని సుందరంగా అలంకరించిన దృశ్యం

**మలక్‌పేట, జూన్ 29 ప్రభాత వార్త :** మలక్‌పేట పల్టాన్‌లోని శ్రీ హరిహర క్షేత్రంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో స్వామివారిని పూలతో సుందరంగా అలంకరించి తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ ప్రతిఆదివారం ఆలయ ఆవరణలో ధర్మ సంబంధమైన విషయాలు, ఆచార వ్యవహారాలు, శ్లోకాలు చెప్పడం జరుగుతుందని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇఓ మార్తాండరావు, ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖశర్మ, సభ్యులు శెట్టి విజయ్‌కుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సాయిబాబా మందిరంలో...** ఓల్డ్ మలక్‌పేటలోని శ్రీ సాయిబాబా మందిరంలో తొలి ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వేమూరి రామకోటేశ్వరరావు, చౌకి రవికుమార్, పి.టి.శంకర్‌ముదిరాజ్, నరేందర్‌ముదిరాజ్, చెగిరెడ్డి, రఘు, సునిత తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కాలనీలో...** తొలి ఏకాదశి సందర్భంగా మలక్‌పేట్ మున్సిపల్ కాలనీలోని వెంకటేశ్వర దేవాలయంలో సర్వదేవతల నిజ స్వరూప దర్శనంతో పాటు వెంకటేశ్వర స్వామికి చందనాభిషేకం ఉదయం నిజరూప దర్శనం అనంతరం స్వామివారికి తులసి మాల అలంకరణ చేసి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మార్తాండ జోషి, చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, బాబు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్‌లో ఇంటింటికి బిజెపి కార్యక్రమం : సామ రంగారెడ్డి



ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న సామ రంగారెడ్డి తదితరులు

**వనస్థలిపురం, జూన్ 29 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ, కేంద్ర ప్రబుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలను తెలియజేస్తూ మహాజన్ సంపర్క్ అభియాన్, ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా హస్తినాపురం డివిజన్‌లో శ్రీ వెంకటేశ్వరాకాలనీ, అగ్రికల్చర్ కాలనీలలో బిజెపి అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పేద మధ్య తరగతి కుటుంబాల ప్రజలను మోసం చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజా అవసరాలను తీర్చలేని కెసిఆర్, దేశ్ కి నేత అంటూ దేశం మొత్తం తిరగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు కనీస అవసరాలు కూడా కల్పించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు.

## కత్తితో బెదిరించి గాయపర్చిన యువకుడి అరెస్ట్

**ఎల్.బి.నగర్, జూన్ 29 ప్రభాతవార్త :** కత్తితో బెదిరించి ఇద్దరిని గాయపరిచిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట రిలయన్స్ పెట్రోల్‌బంక్ సమీపంలోని నరేష్ అనే సేల్స్‌మెన్‌ను, కొత్తపేటలోని అయ్యంగారి బేకరీ సమీపంలో సునీల్‌కుమార్ అనే సేల్స్‌మెన్‌ను శివకుమార్ అనే వ్యక్తి కత్తితో బెదిరించి వారిని గాయపరచి డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితులు వెంటనే చైతన్యపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్‌కె పురం డివిజన్ హరిపురికాలనీకి చెందిన తండు శివకుమార్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతనిని అరెస్ట్ చేసి, అతనివద్దనుంచి యాక్టివా ద్విచక్ర వాహనం, దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## అవినీతి, అభివృద్ధి, నిధులపై దమ్ముంటే బహిరంగ చర్చకు రండి : బిజెపి సవాల్



సమావేశంలో బిఆర్ఎస్ నేతలపై ఫైర్ అవుతున్న బిజెపి నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 29 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏయే నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయే విషయంలో బిఆర్ఎస్ నేతలకు స్పష్టత లేదని కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో పార్టీఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, యువమోర్చా నాయకుడు రామిడి శూరకర్ణారెడ్డి తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టం కింద తాము సేకరించిన సమాచారంతో తాము నిధులు, అభివృద్ధి విషయంలో సహేతుకమైన విమర్శలు చేస్తుంటే జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు తమపై తప్పుడు ఆరోపణలు చేస్తునా న్నరని అన్నారు. కార్పొరేషన్ నిధులు, ప్రత్యేక నిధుల మధ్య బిఆర్ఎస్ నాయకులకు తేడాలు కనిపించడంలేదని ఆయన ఎద్దేవా చేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అవినీతి, అభివృద్ధి, నిధుల విషయంలో దమ్ముంటే బిఆర్ఎస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు.

## సాయిచంద్ మరణం అత్యంతబాధాకరం : డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

**తార్నాక, జూన్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుడు, తన పాటలతో ప్రజలకు ఉద్యమకారులకు స్ఫూర్తినింపిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మరణం అత్యంతబాదాకర మని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్‌రెడ్డి సాయిచంద్ మరణ వార్త తెలుసుకున్న వెంటనే గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి చేరుకున్నారు. ఆయన పార్థివ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో తన ఆటపాటలతో ఉద్యమానికి ఊపిరిపోయిన సాయిచంద్ మృతి తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి ప్రకటిస్తున్నట్లు చెప్పారు.